క్లుప్తంగా

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఏలూరు (టూటౌన్): వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముందు మొత్తం 32 డిమాండ్లను పెట్టామని, సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసుతో ఆలోచించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈఎస్ఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈఎస్ఐ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు మెరుగైన ఆసుపత్రి సేవలు, మందులు, పింఛన్లు సిక్ లీవ్‌లు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈఎస్ఐ పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, వి.సాయిబాబు, కె.వెంకట్రావు, జె.గోపి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలోని 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు ఈ నెల 27న చేయడానికి నిర్ణయించామని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందుకు గాను స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రామచంద్రరావు పేట, విజయ విహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనకాల రోడ్లు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్ స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోమటిలంకలో వేగంగా అభివృద్ధి పనులు

- రూ.6 కోట్లతో వంతెన నిర్మాణం అనుమతి
- రూ.3.94 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు

ఏలూరు రూరల్: చుట్టూ కొల్లేరు...నడిబొడ్డిన గ్రామం...700 మంది జనాభా....తాగేందుకు చుక్క నీరు దొరకదు....నడిచేందుకు దారి లేదు. వరద వస్తే ప్రజలు చిగురుటాకుల వణికిపోతారు....పిల్లా పాపలతో భయం, భయంగా పడవల్లో ప్రయాణం చేస్తారు....ఇదీ ఏలూరు మండలం కోమటిలంక ప్రజల ఒకనాటి దుస్థితి. గత ప్రభుత్వ అసమర్ధ పాలనకు నిలువుటద్దం ఈ గ్రామం..కానీ నేడు పరిస్థితి మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించడంతో పాటు మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో గ్రామ అభివృద్ధికి బాటలు పడ్డాయి. ప్రభుత్వం 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు పచ్చ జెండా ఊపింది. పోల్‌రాజ్ కెనాల్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అనుమతినిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయనుంది. సాంకేతిక కారణాల ఆలస్యమైన ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అధికారులు అంటున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు.



రూ.10 లక్షలతో అభివృద్ధి చేసిన కోమటిలంక ప్రధానరోడ్డు



కోమటిలంకలో పేదల కోసం ఇవ్వనున్న జగనన్నకాలనీలో పూర్తయిన మెరక పనులు



కోమటిలంకలో నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు

తాగునీరు, రోడ్డు సమస్యకు చెక్

ఏడాది క్రితం అధికారులు రూ.3. 94 కోట్లతో అభివృద్ధి చేపట్టి పూర్తి చేశారు. ఇందులో రూ.31 లక్షల రూర్బన్ నిధుల వెచ్చించి మొండికోడు రిజర్వాయర్ నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ వేసారు. మరో రూ.10 లక్షల జలజీవన్‌మిషన్ నిధులతో 204 కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించి తాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. ఆటపాక పక్షుల విడిది కేంద్రం నుంచి గ్రామ సరిహద్దు వరకూ రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేశారు. మరోపక్క గ్రామంలో ఫిల్టర్ బెడ్లకు సైతం మరమ్మతులు చేసేందుకు ఎస్టిమేషన్లు వేశారు. మరో రూ 5 లక్షలతో పెదయాగనమిల్లి అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే రూ.40 లక్షలతో సచివాలయం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు లక్షల ఖర్చు చేసి జగనన్నకాలనీ భూమి మెరక చేస్తున్నారు. ఇందులో ఇల్లు లేని 31 మంది పేదలకు స్థలాలు మంజూరు చేశారు. వీరితో పాటు సొంత స్థలం ఉన్న 85 మంది ఇళ్ల కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చారు. ఇందుకోసం ఒక్కొక్కరికీ రూ.1,80,00 చొప్పున మొత్తం రూ.2 కోట్ల రూపాయలు విడతల వారీగా అందిస్తుంది.

అర్హులందరికీ పథకాలు



మా గ్రామానికి ప్రభుత్వం సచివాలయం, వైఎస్సార్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. సాంకేతిక కారణాల వల్ల పనులు ముందుకు సాగడం లేదు. రానున్న రోజుల్లో పనులు వేగంగా చేస్తాం. రూ.30 లక్షలతో పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్య తీర్చారు. అంత్యక్రియల సమయంలో నీటి వసతి కోసం చెరువు తవ్వుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని కోరుతున్నాను.

– తెనాలి యోహాన్, గ్రామ సర్పంచ్

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో



కోమటిలంక రోడ్డు కోసం గత పాలకులు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అటవీశాఖ అధికారులతో చర్చించి రూ.15 లక్షలతో రెండు రోడ్లు వేయించారు. ప్రధానరోడ్డు మరింత అభివృద్ధి చేస్తాం. త్వరలో ఎమ్మెల్యే తాత్కాలిక బ్రిడ్జి పనులు చేపడతారు. పేదలకు ఇళ్ల స్థలాలు అందించారు. సచివాలయం నిర్మిస్తున్నాం. మరింత అభివృద్ధి సాధిస్తాం.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసి సమస్యను వివరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నానికి ఉద్యోగుల సంఘం వినతిపత్రం సమర్పించింది. ఏలూరు శ్రీరాం నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ,వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ 13/2020 రీజనల్ కోఆర్డినేటర్ జీవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే నానిని కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వార్డుల్లో పర్యటించాలనే నిబంధనలపై తమ సమస్యను చెప్పుకున్నారు. ఉదయం వేళల్లో ప్రత్యేకంగా చేపట్టాల్సిన పనులకు హాజరుకాకుంటే జీతం కట్ చేయాలనే నిబంధన సడలించాలని కోరగా దానికి సానుకూలంగా స్పందించారు. సచివాలయ ఉద్యోగుల జాబ్‌చార్ట్ ఆధారంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మరోసారి అసోసియేషన్ నాయకులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

భీమడోలు: గాలి, వాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయి, తీగలు తెగిపడటంతో గురువారం రాత్రి గ్రామాల్లో అంధకారం ఏర్పడింది. ఒక్కసారిగా ఆకాశంలో పిడుగుల శబ్దాలతో కూడిన వాన కురవడంతో ప్రజలంతా భీతిల్లారు. భారీ వృక్షాలు సైతం రోడ్లపై నేలకొరిగాయి. కొన్ని చోట్ల పెంకుటిల్లు, తాటాకిళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ఇటీవల పూళ్ల, అంబర్‌పేట సబ్‌స్టేషన్లల్లో గాలి,వాన బీభత్సానికి విద్యుత్ శాఖకు జరిగిన నష్టం మరవకముందే గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ శాఖకు మరోసారి అధిక నష్టం సంభవించింది. భీమడోలు, ఎం.నాగులపల్లి, అంబర్‌పేట, కురెళ్లగూడెం, దుద్దేపూడి తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు పెను నష్టం సంభవించింది. భీమడోలులో 20, ఎం.నాగులపల్లిలో 10, అంబర్‌పేటలో 14 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అధికారులు పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికను చేపట్టారు. ఏలూరు విద్యుత్ శాఖ ఈఈ శశిధర్ పర్యవేక్షణలో ఏడీఈ కె.గోపాలకృష్ణ నేతృత్వంతో ఏఈలు రామస్వామి, రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సమస్య పరిష్కార చర్యలకు ఉపక్రమించారు. తీవ్రంగా శ్రమించి శుక్రవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భీమడోలు, ఎం.నాగులపల్లి, కురెళ్లగూడెంలో చేపట్టిన పనులను ఈఈ శశిధర్ పరిశీలించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: మండలంలో 5 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. చిన్న వెల్లమిల్లి, తల్లాపురం, రామన్నగూడెం, సీతారామపురం, కైకరంలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు తెలిపారు. 2022 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలులోపు ఉండాలని సీడీపీవో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు అర్హులని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	16	కంద	56
పచ్చిమిర్చి	42	బీట్‌రూట్	34
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	16	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	--	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	14	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	10
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	35
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

వేసవి సెలవులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయపరిషత్ సభ్యుడు మహేష్ బాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు తమ వేసవి సెలవులను విజ్ఞాన సముపార్జనకు వినియోగించుకుని విజ్ఞానవంతులుగా మారాలని, వివిధ అంశాల్లో ప్రవేశం పొంది తమ తోటి వారికంటే భిన్నంగా, ఉన్నతంగా ఉండడానికి కృషి చేయాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీవీ మహేష్ బాబు పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని, తమ అభిరుచులకు తగ్గట్టు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. 19వ రోజు శిబిరంలో ప్రముఖ టీవీ యాంకర్ సోమ్లా నాయక్ వినోదాత్మక గీతాలను పాడి విద్యార్థులతో పాడించి శిక్షణ ఇచ్చారు. అనంతరం డీ. శ్రీవల్లి విద్యార్థులకు గాజు గ్లాసులు, గాజు కుండీల్లో వినియోగించే పుష్పగుచ్ఛాలను తయారు చేయడం నేర్పారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ కె.ఫణికాంత్ పాశ్చాత్య నృత్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు పర్యవేక్షించగా ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణ రావు, ఎం.శ్యామల బాబు, గ్రంథాలయ సిబ్బంది ఎండీ అస్లాం పాషా, బి.రమేష్, బీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని వినతి



డ్వామా పీడీ ఏ.రాముకు వినతి పత్రం అందజేస్తున్న ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీలో పని చేస్తున్న మండల, కింది స్థాయి అధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. జిల్లా డ్వామా పీడీ ఏ.రామును శుక్రవారం కలిసిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఎంతో ప్రతిష్టతతో కూడుకుందన్నారు. అలాంటి పథకం నేడు అన్ని స్థాయిల్లో అవినీతి పేరుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీవ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని 27 మండలాల్లో పర్యటించిన సందర్భంలో కూలీల నుంచి వచ్చిన సమస్యలను మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళాలని కోరారు. పెదవేగి, దెందులూరు, లింగపాలెం, చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లో స్వయంగా మండలస్థాయి అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కనుసన్నల్లోనే కూలీల నుంచి డబ్బులు వసూలు చేసే దందా జరుగుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు ఇస్తేనే మస్టర్లు వేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కూలీలను వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై పీడీ ఎ.రాము స్పందిస్తూ జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సైట్ సూపర్‌వైజర్లపై మా దృష్టికి వచ్చిన అంశాలపై దర్యాప్తు జరుపతామని తెలియజేశారు. ఆరోపణలు నిజమని రుజువైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఏలూరు గజ్జలవారిచెరువు ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఏలూరు టౌన్: పరిసరాలు పరిశుభ్రత పాటించడం, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని దోమలతో అనేక రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ తెలిపారు. ఏలూరు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గజ్జలవారిచెరువు ప్రాంతంలో, తోటకూరదొడ్డి సచివాలయం పరిధిలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు. నగరవీధుల్లో బ్యానర్లు ప్రదర్శిస్తూ స్లోగన్స్ చెబుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో, ఇంట్లో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా తదితర ప్రమాదకరమైన వ్యాధుల బారినపడే అవకాశం ఉందని తెలిపారు. దోమకాటు నుంచి రక్షణకు దోమల నివారణే మార్గమన్నారు. వారానికి ఒకసారి ఖచ్చితంగా ఫ్లవర్‌వాజ్‌లు, పూల కుండీలు, రుబ్బురోళ్ళు, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, బయట పారవేసిన టైర్లు వంటి వాటిలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర వసతిగృహం తనిఖీ

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ వసతి గృహంలోని బాలురకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో బాలరుకు అందజేస్తున్న ఆహారం, వైద్యం, పరిసరాల శుభ్రత వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, నిబంధనల మేరకు అందజేయాలన్నారు. వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయించాలని తద్వారా వసతి గృహంలో ప్రశాంత వాతావరణం కనిపిస్తుందన్నారు. అబ్జర్వేషన్‌లోని బాలుర కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందుబాటులో ఉన్న న్యాయవాది వివరాలు గురించి ఆరా తీశారు. అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ వాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహ సూపరింటెండ్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాకలంక ఎస్సీ కాలనీలో రోడ్ల అభివృద్ధి



గుడివాకలంక ఎస్సీకాలనీ రోడ్లు పరిశీలిస్తున్న ఎంపీపీ, గ్రామస్తులు

ఏలూరు రూరల్: మండలంలోని గుడివాకలంక ఎస్సీ కాలనీలో రోడ్లు అభివృద్ధి చేయనున్నామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు చెప్పారు. శుక్రవారం ఆయన ఎంపీటీసీ సభ్యులు మోరు రజని, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావుతో పాటు గ్రామ పెద్దలతో కలిసి కాలనీ రోడ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కాలనీలో నివసిస్తున్న పేదల కోసం రోడ్లు అభివృద్ధి చేయాలని ఆదేశించారని వివరించారు. ఆయన సూచనల మేరకు ఎస్సీకాలనీలో గ్రావెల్ రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చు చేస్తామన్నారు. ఈ పనులపై ఎస్టిమేషన్లు రూపొందించాలని తనతో పాటు వచ్చిన పీఆర్ ఏఈ కృష్ణమోహన్‌ను ఆదేశించారు. ఇదే క్రమంలో పనుల కోసం పంచాయతీ తీర్మానాలు చేసి ఇవ్వాలంటూ కార్యదర్శికి సూచించారు. నిధుల కేటాయించినందుకు గ్రామ పెద్దలు ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.